సాక్షి మహబూబాబాద్

శుక్రవారం । 9 । జూన్ । 2023



సాధారణ గింజలకు రంగు..
సాధారణ విత్తనాలకు రంగులతో మెరుగులు దిద్ది మేలిమి విత్తనాలంటూ రైతులకు అంటగడుతున్న రెండు ముఠాల గుట్టును వరంగల్ కమిషనరేట్ పోలీసులు రట్టు చేశారు. - 8లో ▸



మంత్రులకు మతిభ్రమించింది
అధికారానికి రోజులు దగ్గర పడుతున్నా కొద్దీ బీఆర్‌ఎస్ మంత్రులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ములుగు ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. - 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
44.5^0 / 28.0^0
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు తీవ్రమైన వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విత్తన దుకాణాల్లో తనిఖీలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. అమ్మ అగ్రిమాల్, తెలంగాణ ఆగ్రో ఏజెన్సీస్, శ్రీసాయి సీడ్స్, కిసాస్ అగ్రిమాల్ విత్తన దుకాణాల్లో టెక్నికల్ ఏడీఏ రాజనరేందర్, ఏఓ తిరుపతిరెడ్డి తనిఖీ చేసి పరిశీలన చేశారు. విత్తన లైసెన్స్, పలు కంపెనీల ఇన్వాయిస్‌లు, లాట్ నంబర్లు, పీసీలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన, ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలని పేర్కొన్నారు. అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ జారీ చేసిన విత్తన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే బిల్లుతో విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు.

పూర్వ విద్యార్థులు సహకరించాలి



మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్వ విద్యార్థులు సహకరించి, విద్యార్థులను జాయిన్ చేయాలని కంబాలపల్లి పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు గురునాథరావు అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు వి.గురునాథరావు, జి.సంజీవ, ఈ.శ్రీధర్, పూర్వ విద్యార్థులు, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ఇన్స్‌పైర్ అవార్డు గ్రహీత డి.అంజలి, అభినాయక్, రాచకొండ నవీన్, నవనీత్, ప్రస్తుత విద్యార్థులు దుబ్బతండా, గడ్డిగూడెంతండా, కంబాలపల్లిలో ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచిపెట్టారు. పిల్లలను పభుత్వ పాఠశాలలకు పంపించాలని పూర్వ విద్యార్థిని అంజలి విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

గవర్నర్ చేతుల మీదుగా లక్ష్మణ్‌కు సర్టిఫికెట్



మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మణ్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను గురువారం హైదరాబాద్‌లో అందుకున్నారు. లక్ష్మణ్ లాంగెస్ట్ మ్యాథమెటిక్స్ ప్రారంభించి 71 గంటల 52 నిమిషాల 48 సెకన్ల పాటు ఉపన్యాసం ఇచ్చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటుసాధించి సర్టిఫికెట్ అందుకున్నారు.

ఎమ్మెల్యేకు నిరసన సెగ



డోర్నకల్: తండాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని బోడహట్యాతండా వాసులు ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఎదుట నిరసన తెలిపారు. గురువారం తండాలో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈక్రమంలో తమ తండాలో చాలా కాలంగా తాగునీటి సమస్య ఉందని, పలుమార్లు నాయకులకు చెప్పినా పట్టించుకోవడంలేదంటూ స్థానికులు ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకున్నారు. అధికార పార్టీ నేతలు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా స్థానికులు వినకపోవడంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నేడు కాళేశ్వరాలయంలో టెండర్ల నిర్వహణ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ మహేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు భద్రపరిచేందుకు, భక్తుల వాహన పార్కింగ్ టెండర్లను ఒక సంవత్సరానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెండర్లలో పాల్గొనేవారు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

సర్కారు బడిలో చేరండి

జిల్లాలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం
- విద్యార్థుల వద్దకు ఉపాధ్యాయులు
- ఇప్పటి వరకు 1,926 మంది చేరిక



రెడ్యాల గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు వందలాది మంది విద్యార్థులతో కళకళలాడాయి. ఆయా పాఠశాలల్లో చదివిన వేలాదిమంది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అలాంటి చరిత్ర గల ప్రభుత్వ బడుల పరిస్థితి ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. కనీస సంఖ్యలో కూడా విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలలు వెలవెలబోతున్నాయి. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఏటా నూతన విద్యా సంవత్సరంలోకి అడుగు పెట్టడానికి ముందే ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇది ఫలితాలు ఇస్తోంది.

పిల్లల వద్దకు టీచర్లు..

జిల్లాలో ఈనెల 3న బడి బాట కార్యక్రమం మొదలైంది. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వచ్చే పిల్లల జాబితాను సేకరించి, వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అదే విధంగా ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన బాలికలను కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్‌లో చేర్పిస్తున్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించడంతోపాటు, యూనిఫాం, పుస్తకాలు, బస్సుల ఖర్చులు అదనంగా భరించాల్సి వస్తుందని అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, అర్హత గల ఉపాధ్యాయులు, కస్తూరిబా పాఠశాలల్లో బాలికల రక్షణ, వసతి, ఉచిత పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా ఇవ్వడం, ఇక్కడ చదివిన విద్యార్థులకు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు, ఉన్నత విద్యా అవకాశాలను వివరిస్తున్నారు.

1,926 మంది చేరిక..

బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,926 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పొందారు. ఇందులో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరి ఐదు సంవత్సరాలు పూర్తయిన బాల, బాలికలు 788 మంది, ప్రైవేటు పాఠశాలల్లో చదివి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారు 321 మంది ఉన్నారు. అలాగే తండాలు,మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి చదివి ఆరో తరగతికి ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో చేరినవారు 817మంది మొత్తంగా 1,926 మందిని ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు డీఈఓ రామారావు తెలిపారు.

జిల్లాలో విద్యార్థుల సంఖ్య

జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు : 893
ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు : 10,6829
బడి బాటలో చేరిన విద్యార్థులు
అంగన్‌వాడీ కేంద్రాల నుంచి: 788
ప్రైవేటు పాఠశాలల నుంచి : 321
పీఎస్ నుంచి ఉన్నత పాఠశాలల్లో చేరిన వారు: 817
మొత్తం ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరిన వారు:1,926

చేరికలు పెరిగాయి



ఈనెల 3వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమంలో భాగంగా అడ్మిషన్ల ప్రక్రియను మొదలుపెట్టాం. మా పాఠశాల దగ్గరలో ఉన్న గ్రామాలు, తండాల్లో ఐదో తరగతి పూర్తి చేసిన బాలికల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి కేజీబీవీల గురించి వివరించాం. గతంతో పోలిస్తే ఈ ఏడాది మంచి స్పందన వచ్చింది. కేజీబీవీల్లో బాలికల చేరికలు పెరిగాయి.

– శ్రీదేవి, కేజీబీవీ ఉపాధ్యాయురాలు

మంచి స్పందన వస్తున్నది



ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమానికి మంచి స్పందన వస్తుంది. ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు చేసిన తర్వాత తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. వసతులకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.

– భద్రినారాయణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులను పెంచాలి..



ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగింది. విద్యార్థుల చేరికలు పెరిగాయి. అయితే ఐదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం బోధించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న చోట తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకోకుండా సబ్జెక్టుల బోధన ఆధారంగా ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలి. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలి.

– చుంచు శ్రీశైలం, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మత్స్యకారుల అభివృద్ధికి సీఎం కృషి



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్



చేప వంటకం రుచి చూస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

- మంత్రి సత్యవతిరాథోడ్
- ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో వేసవికాలంలో చెరువులు ఎండిపోయి కనిపించేవని, నేడు మండుటెండలో కాళేశ్వరం జలాలతో నిండుగా ఉండి అలుగులు పారుతున్నాయని అన్నారు. చెరువుల్లో నీరు ఉండడంతో మత్స్య సంపద వృద్ధి చెంది మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతమవుతున్నారన్నారు. మత్స్య సొసైటీలను ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. చేపల ఉత్పత్తితో పాటు విక్రయాలు పెంచేందుకు నిరుపేద మత్స్యకారుల కుటుంబాలకు వలలు, వాహనాలు అందిస్తూ వారి జీవనోపాధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. జిల్లాలో ప్రత్యక్షంగా 11వేల మంది మత్స్యకారుల కుటుంబాలు, పరోక్షంగా 35వేల కుటుంబాలు చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. మత్స్యకారులకు ప్రమాద బీమా రూ.5 లక్షలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 17మంది కుటుంబాలకు అందించినట్లు వెల్లడించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు మాట్లాడుతూ.. మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలు అందించి ఆదుకుంటామన్నారు. ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని, మహిళలకు సహకారం అందజేస్తామన్నారు. ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. మత్స్య సొసైటీలను బలోపేతం చేశామని చెప్పారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందన్నారు. కాకతీయులకాలం నాటి చెరువులను పటిష్టపర్చి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పారు. మత్స్యకారులకు జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. పలు రకాల చేపల వంటకాలను రుచి చూశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, జెడ్పీ సీఈఓ రమాదేవి, అధికారులు నర్మద, ఖుర్షిద్, వెంకట్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారి నాగమణి, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్, కాట భాస్కర్, సహదేవ్, కౌన్సిలర్లు వెంకన్న, బుజ్జి వెంకన్న, నాయకులు శ్రీనివాస్, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ కాకతీయ'తో చెరువులకు పూర్వ వైభవం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా చెరువుల పండుగ



గుర్తూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు, కుంటలకు పూర్వ వైభవం వచ్చిందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని సోమారం, గుర్తూరు గ్రామాల్లో నిర్వహించిన చెరువుల పండుగలో మంత్రి దయాకర్‌రావు పాల్గొన్ని మాట్లాడారు. గత ప్రభుత్వాల పాలనలో సరిపడా సాగునీరు, కరెంట్ లేక రైతులు ఇబ్బందుపడ్డారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలకు తగిన న్యాయం జరిగిందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



ఇళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని పెనుగొండ గ్రామంలో రూ.1.57కోట్లతో నిర్మించిన 25 డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించి, పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల నిర్మల, డాక్టర్ సీతామహాలక్ష్మి, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మార్కెట్ చైర్పర్సన్ నీలం సుహాసినిదుర్గేష్, రైతుబంధుసమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, మార్కెట్ డైరెక్టర్ జాటోత్ హరీశ్‌నాయక్, మాచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేపలకు గిరాకీ..



డోర్నకల్: బైపాస్ రోడ్డులో చేపల విక్రయం

నెహ్రూసెంటర్/డోర్నకల్: మృగశిర కార్తె ప్రారంభం రోజు చేపలను తినడం ఆనవాయితీగా వస్తోంది. కాగా జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రజలు చేపలు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. కేజీ రూ.180 నుంచి రూ.200వరకు విక్రయించగా కొర్రమీను చేప అధిక ధర పలికింది. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోని చెరువులు, కుంటల వద్ద సందడి వాతావరణం నెలకొనగా జిల్లా కేంద్రంలోని రైల్వే గేటు సమీపంలో చేపలను కొనుగోలు చేసేందుకు ప్రజలు గుమిగూడారు.



చేపలను కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు

మినీ రిజర్వాయర్‌గా మార్చేందుకు కృషి

కురవి: మండల కేంద్రంలోని పెద్ద చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చేందుకు కృషి చేస్తానని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. గురువారం కురవి పెద్ద చెరువు కట్టపై యాదవ కులస్తులు నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయాన్ని ఆమె ప్రారంభించారు. చెరువులో గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ రోజు బొడ్రాయి, గంగమ్మతల్లి ప్రతిష్ఠాపన చేసుకోవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గుగులోత్ శ్రీరాం నాయక్, ముత్యం వెంకన్నగౌడ్, బాదె నాగయ్య, డాక్టర్ సుందర్‌నాయక్, ఆలయ మాజీ చైర్మన్లు సోమిశెట్టి శ్రీనివాస్, బాదావత్ రాజునాయక్, యాదవ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వైద్యుల కొరత

- గార్ల సీహెచ్‌సీలో సౌకర్యాలు మెరుగు
- డాక్టర్ల నియామకంలో నిర్లక్ష్యం
- ప్రజలకు అందని మెరుగైన వైద్య సేవలు



గార్ల సీహెచ్‌సీ

గార్ల: మండల కేంద్రంలో రూ.5 కోట్లు వెచ్చించి 30 పడకల ఆస్పత్రిని నిర్మించారు. మెరుగైన సౌకర్యాలు కల్పించారు. అయితే వైద్యుల కొరతతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. సీహెచ్‌సీలో డాక్టర్ల నియామకంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మెరుగైన సౌకర్యాలు..

ఏడాది క్రితం ఆస్పత్రి వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి వెళ్లింది. దీంతో ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంటు, స్కానింగ్, ఎక్స్‌రే, రక్త, మూత్ర నమూనాల పరీక్షల ల్యాబ్ ఏర్పాటు చేశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. కరోనా సమయంలో ఐసొలేషన్ వార్డులో సేవలందించారు.

సరిపడా లేరు..

ఆస్పత్రిలో ఏడుగురు స్పెషలిస్ట్ వైద్యులు, 30మంది వైద్య సిబ్బంది ఉండాలి. కానీ ఒక స్పెషలిస్ట్, ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు, 10 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఇటీవల ఇద్దరు డాక్టర్లు నియామకమై 3 నెలలు విధులు నిర్వహించారు. అయితే వారికి కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా అవకాశం రావడంతో వెళ్లిపోయారు. కాగా ఆస్పత్రికి రోజుకు 250 మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందడం లేదు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..

మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న జిల్లా ఆస్పత్రిలో పనిచేసే స్పెషలిస్ట్ వైద్యులు గార్ల, గూడూరు సీహెచ్‌సీలో జాయిన్ కావాలని కలెక్టర్ శశాంక ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆయన ఆదేశాలను వైద్యులు బేఖాతర్ చేస్తూ మానుకోట ఆస్పత్రిలోనే విధులు నిర్వహిస్తున్నారు.

స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత ఉంది



గార్ల సీహెచ్‌సీలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత ఉంది. ఆస్పత్రిలో వైద్య సేవల కోసం ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించింది. స్పెషలిస్ట్ వైద్యుల కోసం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకట్రాములుకు నివేదిక పంపించా.

– డాక్టర్ రాజేష్, సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

రైతన్నల అరిగోస..

- ధాన్యం విక్రయ సమయంలో తప్పని తిప్పలు
- కాంటాలు, ఆన్‌లైన్ నమోదు, మిల్లులకు తరలింపులో జాప్యం
- కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు, ఆందోళనలు
- రూ.53 కోట్లు మాత్రమే చెల్లింపు



పర్వతగిరి గ్రామంలో రోడ్డుపై ధాన్యానికి నిప్పపెట్టి రాస్తారోకో చేస్తున్న రైతులు(ఫైల్)

మహబూబాబాద్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించే సమయంలోనూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు, మిల్లులకు బస్తాల తరలింపు, కటింగ్ పేరుతో రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. తీరా ధాన్యం అమ్మిన తర్వాత డబ్బులు సకాలంలో ఖాతాల్లో జమ కావడం లేదు. ఇలా రైతులు అన్ని రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా ధాన్యం కాంటాలు, మిల్లులకు తరలింపులో ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ధాన్యం బస్తాలకు నిప్పుపెట్టి తమ నిరసనను తెలుపుతున్నారు. ఇంత జరిగినా సంబంధిత అధికారులు మాత్రం రైతుల సమస్యల పరిష్కారంలో చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆలస్యంగా కాంటాలు, తరలింపు..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాల కాంటాలు ఆసల్యంగా పెడుతున్నారు. దీంతో రైతులు పడిగాపులు కాయాల్సివస్తోంది. జిల్లాలోని 22 మిల్లులు, కరీంనగర్ జిల్లాలోని 75 మిల్లులు, వరంగల్‌లోని 11మిల్లులను కేటాయించారు. కాగా కాంట్రాక్టర్లు లారీల కొరత ఇతర సమస్యలతో ఆయా మిల్లులకు ధాన్యం తరలింపులో ఆలస్యం చేస్తున్నారు. ఈ క్రమంలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిన ఘటనలు ఉన్నాయి. దీంతో కొంతమంది రైతులు సొంతంగా ట్రాక్టర్ల ద్వారా బస్తాలను మిల్లులకు తరలించారు. మిల్లుల వద్ద తాలు, తరుగు పేరిట బస్తాకు 5కిలోల వరకు కోత విధించి రైతులను నిండా ముంచుతున్నారు. దీంతో రైతులు ఆందళనకు దిగుతున్నారు.

రైతుల ఆందోళన..

కేంద్రాల్లో ధాన్యం కాంటాలు, తరలింపులో ఆలస్యం కావడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. రాస్తారోకో, ధర్నాలతో పాటు చివరికి సహనం కోల్పోయి పండించిన పంటకు నిప్పు పెట్టి నిరసన తెలుపుతున్నారు. జిల్లాలో అన్నదాతల ఆందోళలు పెరుగుతున్నాయి.

చెల్లింపుల్లో తాత్సారం..

జిల్లాలో 185 కేంద్రాలకు బదులు 122 కేంద్రాల ద్వారానే ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. ఈ క్రమంలో 63 కేంద్రాలు మూసివేశారు. ఈనెల 4వ తేదీ వరకు 99,788.660 మెట్రిక్‌టన్నుల ధాన్యం 1,1442 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో నమోదైన 5,448 మంది రైతులకు రూ.53.60కోట్లు చెల్లించారు. మిగిలిన 5,994 మంది రైతులకు సంబంధించి రూ 58.95కోట్లు పెండింగ్‌లోనే ఉన్నాయి.

వారం రోజుల్లో పూర్తి చేస్తాం..

వారం రోజుల్లో మిల్లులకు ధాన్యం తరలింపు పూర్తి చేస్తాం. మన జిల్లాతో పాటు పక్కజిల్లాల్లోని 108 మిల్లుకు వడ్లు తరలిస్తున్నాం. మిల్లర్లు క్వింటాకు 68 కిలోల బియ్యం పెట్టాలి. అందుకోసం తరుగు చేస్తున్నారు. రైతులకు నష్టం జరగకుండా చూస్తున్నాం.

– నర్సింగరావు, డీసీఎస్‌ఓ

మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాళ్ల బదిలీ



శ్రీపాల నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న నీలిమాదేవి

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా పరిధి తెలంగాణ మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాళ్లు వరంగల్(జీ2), బి.శ్రీపాల, నర్సంపేట(జీ1) టి.నీలిమాదేవీని బదిలీ చేస్తూ టెమ్రిస్ సెక్రటరీ షఫీయుల్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేట ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నీలిమాదేవిని వరంగల్ శంభునిపేటలోని వరంగల్(జీ2) గురుకులానికి, ఇక్కడ పనిచేస్తున్న బి.శ్రీపాలను నర్సంపేట ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసి, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు (రీజినల్ కో–ఆర్డినేటర్) ఆర్‌ఎల్‌సీ–1గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, వరంగల్(జీ2), ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన నీలిమాదేవికి అధ్యాపకులు ఆఫ్రిన్, కల్పనాదేవి, నజ్మాబేగం, జయలక్ష్మి, అనిత, డిప్యూటీవార్డెన్ ఉజ్మా, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

గార్ల: వడదెబ్బకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా గార్లలో జరిగింది. గార్లలోని ఇందిరానగర్‌కు చెందిన తడికమల్ల శ్రీనివాస్(45) టైలర్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో 3 రోజులుగా వీస్తున్న వడగాడ్పులు, ఎండతీవ్రతకు తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. కాగా, శ్రీనివాస్ మృతదేహానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు నివాళులర్పించారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి ..



సునీల్(ఫైల్)

నల్లబెల్లి: పండగకు నూతన వస్త్రాలు లేవని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రాంపూర్‌లో జరిగింది. ఎస్సై నగేశ్ కథనం ప్రకారం ఈ నెల 8, 9, 10వ తేదీల్లో మేడపల్లి, రాంపూర్ జంట గ్రామాల్లో రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి నూతన వస్త్రాలు తీసుకునే విషయంలో శివరాత్రి సునీల్ (30), భార్య సుమతికి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సునీల్ ఈ నెల 3వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సంపేట లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికి త్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లి యాకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాధారణ గింజలకు రంగు.. అన్నదాతకు ఆ‘పత్తి’..

నకిలీ విత్తన విక్రయ ముఠాల గుట్టు రట్టు
- రూ.2.11కోట్ల విలువైన 12 టన్నుల నకిలీ విత్తనాలు పట్టివేత
- రిషి, శ్రీగణేశ్ విత్తనాలు కొనొద్దు
- ఆన్‌లైన్‌లో విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి
- పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: సాధారణ విత్తనాలకు రంగులతో మెరుగులు దిద్ది మేలిమి విత్తనాలంటూ రైతులకు అంటగడుతున్న రెండు ముఠాల గుట్టును వరంగల్ కమిషనరేట్ పోలీసులు రట్టు చేశారు. వరంగల్ జిల్లా కేంద్రంగా నకిలీ విత్తన విక్రయాలకు పాల్పడుతున్న రెండు ముఠాలకు చెందిన 15 మందిని టాస్క్‌ఫోర్స్, మడికొండ, ఏనుమాముల పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. మరో ముగ్గురు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు ఆయన ప్రకటించారు. వీరి నుంచి రూ.2.11 కోట్ల విలువైన నకిలీ విత్తనాలు, ఏడు టన్నుల విడి విత్తనాలు, 9,765 నకిలీ విత్తనాల ప్యాకెట్లు, ఒక డీసీఎం, ఒక కారు, రూ.21 లక్షల నగదు, నకిలీ విత్తన ప్యాకెట్ల తయారీ కోసం అవసరమైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన దాసరి శ్రీనివాస్, తాప్తే హనుమంతు, బాపట్లకు చెందిన సుందరశెట్టి ఫణీందర్, హైదరాబాద్‌కు చెందిన చేడాం పాండు, చేడాం వెంకటరమణ, వేముల అరవింద్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌కు చెందిన చేడాం నాగరాజు, నాగర్ కర్నూల్‌కు చెందిన కాల్వ శ్రీధర్, మంచిర్యాలకు చెందిన కొప్పుల రాజేశ్, బోగే సత్యం, షేక్ అన్వద్, ఇందుర్తి వెంకటేష్, పుట్ట రాజేశం, మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన వడిచర్ల సురేందర్ రెడ్డి, బలార్షకు చెందిన ఏన్గుడే దిలీప్‌ను అరెస్టు చేయగా శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంప సదాశివ్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

విడివిత్తనాలు కొనుగోలు చేసి..రంగులు..

ముఠాలోని సభ్యులు రైతుల నుంచి తక్కువ ధరకు విడిగా విత్తనాలు కొనుగోలు చేసి వాటికి రంగులద్దుతున్నారు. ఈ ముఠాలోని ప్రధాన నిందితులు దాసరి శ్రీనివాసరావు, భాస్కర్‌రెడ్డి కర్ణాటకలో నిర్వహిస్తున్న విత్తన కంపెనీలకు తరలించి అక్కడ విత్తన శుద్ధి చేసేవారు. శుద్ధి చేసిన నకిలీ విత్తనాలను అన్నదాతలకు అంటగడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన బీజీ– 3, హెచ్‌టీ పేరు గల పత్తి విత్తనాలు గడ్డి మందును తట్టుకుంటాయని, ఈ విత్తనాలు ఆధీకృత డీలర్ల వద్ద ఉండవంటూ రైతుల మోసం చేస్తున్నారన్నారు. వివిధ రకాల పేరున్న విత్తన కంపెనీల పేర్లతో ఆకర్షణీయంగా ప్యాక్ చేసి వాటిని వరంగల్‌కు తీసుకువచ్చారని సీపీ తెలిపారు. ఇక్కడి నుంచి తెలంగాణ, మహారాష్ట్రలోని పలు జిల్లాలకు చెందిన విత్తన డీలర్లు, రైతులకు విక్రయించినట్లు పేర్కొన్నారు.మరో ముఠాకు సంబంధించిన ప్రధాన నిందితుడు చేడాం పాండుకు ప్రభుత్వ అనుమతులు కలిగిన రుషి, శ్రీ గణేశ విత్తన శుద్ధి కంపెనీలు ఉన్నాయని, ఈ కంపెనీల ద్వారా గుజరాత్‌లోని నర్మదాసాగర్ కంపెనీ నుంచి దిగుమతైన విత్తనాలను ఈ కంపెనీల ద్వారా తెలంగాణలోని వివిధ జిల్లాలకు విక్రయించేవాడన్నారు. ఇదే అదునుగా భావించిన నిందితుడు మరికొందరితో కలిసి అసలైన నర్మద కంపెనీకి చెందిన విత్తన ప్యాకెట్ల మాదిరి నకిలీ విత్తన ప్యాకెట్లు తయారు చేసి తెలంగాణలోని వివిధ జిల్లాల్లో విక్రయించినట్లు ఆయన తెలిపారు.

ముందే హెచ్చరించిన ‘సాక్షి’

ఉమ్మడి జిల్లాలోకి నకిలీ విత్తనాలు ప్రవేశిస్తున్నాయని ‘సాక్షి’ దినపత్రిక గత నెలలో ముందుస్తు హెచ్చరిక కథనాన్ని ప్రచురించింది. ఏయే ప్రాంతాలనుంచి నకిలీ విత్తనాలు జిల్లాలకు వస్తున్నాయి.. గతంలో పట్టుబడిన ఘటనలను ఉదాహరిస్తూ ‘రైతుకు నకిలీ గండం’శీర్షికన కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని నిజం చేస్తూ తాజాగా పెద్ద ఎత్తున విత్తనాలు పట్టుబడ్డాయి.



స్వాధీనం చేసుకున్న విత్తనాలు

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

గుజరాత్‌కు చెందిన నర్మదసాగర్ పత్తి విత్తనాల జనటిక్ ప్రాసెస్ మహారాష్ట్రలో జరుగుతుందని, ఆ కంపెనీ కొంత మంది వ్యక్తులకు కో–మార్కెటింగ్ ఇచ్చిందని, దీని ముసుగులో కొంత మంది నకిలీ విత్తనాల తయారీకి తెర లేపినట్లు సీపీ తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు, ఆన్‌లైన్‌లో అర్డర్ చేసే ముందు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ కోరారు. రిషి, శ్రీగణేశ్ కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలను కొనుగోలు చేయొద్దని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

అధికారులకు అభినందనలు..

పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, మడికొండ, ఏనుమాముల, వ్యవసాయ శాఖ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి బుధవారం అరెస్టు చేసి విచారించగా నిందితులు తమ నేరాలను అంగీకరించారని సీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన పోలీసులను సీపీ అభినందించారు.

విత్తన వ్యాపారుల మాయాజాలం...
- అనుమతిలేని పత్తి విత్తనాలు బ్లాక్‌లో విక్రయం
- బీజీ–3 పేరిట దందా..
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- గ్రామాల్లో ఏజెంట్ల ద్వారా అమ్మకాలు
- బిల్లులు లేకున్నా కొనుగోలు చేస్తున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు



కరీమాబాద్ : విత్తు విత్తింది మొదలు.. పంట చేతికొచ్చి మార్కెట్‌లో విక్రయించే వరకు అన్నదాత ప్రతీ చోట మోసానికి గురవుతూనే ఉన్నాడు. వ్యాపారుల నుంచి మొదలు.. దళారులు, అధికారుల వరకు.. ఇలా అన్ని చోట్ల రైతు దగా పడుతూనే ఉన్నాడు. అయినా ఎలాంటి లాభాపేక్షా లేకుండా మట్టిపై మమకారంతో వ్యవసాయం చేస్తూ దేశానికి అన్నం పెడుతున్నాడు. ఇలాంటి రైతుల విషయంలో కొందరు విత్తన వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమ సంపాదనలో ఆరితేరిన కొందరు వ్యాపారులు రైతుల ఆసక్తిని ఆసరా చేసుకుని ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన అడ్రస్ లేని పత్తి విత్తనాలను అంటగడుతున్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి తమ షాపులకే వస్తున్న రైతులను ఎంచుకుని వారిని నమ్మించి విత్తనాలు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1600కు పైగా లైసెన్స్ కలిగిన విత్తన దుకాణాలున్నట్లు సమాచారం.

రైతుల ఆసక్తే ఆసరాగా ..

రైతులు ఆసక్తి చూపుతున్న విత్తనాలను ఎక్కువ ధరకు విక్రయించడం, ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన విత్తనాలకు బిల్లులు లేకుండా అంటగడుతుండడం, బీజీ–3 పేరిట రైతులను మభ్యపెడుతుండడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతోంది. జిల్లాలో కొద్ది రోజులుగా ఈ తతంగం జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి..

సాగు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పద్ధతిలో ఉంటుంది కొన్ని రాష్ట్రాల్లో ముందుగానే పత్తి విత్తితే.. మరికొన్ని రాష్ట్రాల్లో ఆలస్యంగా విత్తుతుంటారు. ఈ నేపథ్యంలో విత్తన వ్యాపారంలో పేరు గడించిన కొందరు విత్తనోత్పత్తి ఎక్కువగా జరిగే మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి విత్తనాలు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బీజీ–3 పేరు చెబుతున్న వాటికి ఇక్కడ విక్రయించే అనుమతులు లేకపోవడంతో రహస్యంగా విక్రయిస్తున్నట్లు సమాచారం.

గ్రామాల్లో ఏజెంట్లతో అమ్మకాలు..

ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన పత్తి విత్తనాలు ఇక్కడ విక్రయించే అవకాశం లేకపోవడంతో తమ షాపులలో పని చేసే వ్యక్తులతోపాటు గ్రామాలలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని అమ్ముతున్నట్లు తెలుస్తోంది. రైతులు కూడా పెట్టుబడి తగ్గించుకోవాలనే ఆలోచనకు రావడంతో వారికి తగ్గట్టుగానే వ్యాపారులు బీజీ–3 విత్తనాలు వినియోగిస్తే చేనులో కలుపు రాకుండా ఉంటుందని, చీడపీడలు తక్కువ ఆశిస్తాయని చెబుతున్నారని తెలుస్తోంది. కొన్ని ఏళ్లుగా జరుగుతున్న ఘటనలను పరిశీలిస్తే విత్తన కంపెనీల్లో పనిచేసిన వ్యక్తులు, డిస్ట్రిబ్యూటర్, డీలర్లుగా వ్యవహరించిన వారు అక్రమ దందాలలో భాగస్వాములవుతున్నట్లు తెలుస్తోంది.

బిల్లులు లేని ప్యాకెట్లకు బాధ్యులెవరు?

రైతుల ఆసక్తిని ఆసరా చేసుకున్న కొందరు వ్యాపారులు వారు కోరిన విత్తనాలకు అధిక ధర తీసుకోవడమే కాకుండా బిల్లులు ఇవ్వడం లేదని తెలుస్తోంది. రైతులు ఈ సంవత్సరం నాథ్ సీడ్ కంపెనీకి చెందిన సంకేత్, యూఎస్ అగ్రిసీడ్ కంపెనీకి చెందిన యూఎస్ 7067 పత్తి విత్తనాలపై ఆసక్తి చూపుతుండడంతో వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి రూ.2500 నుంచి రూ. 3000 వరకు బిల్లులు లేకుండా ఇస్తున్నట్లు తెలుస్తోంది. గత అనుభవాల దృష్ట్యా పంటల నష్టం జరిగితే ఎవరు బాధ్యులనేది ప్రస్తుతం ప్రశ్నగా మారుతోంది. రైతులకు విత్తనాలు, కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మంత్రులకు మతిభ్రమించింది

- మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి
- ములుగు ఎమ్మెల్యే సీతక్క



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు: ప్రభుత్వానికి రోజులు దగ్గర పడుతున్నకొద్ది బీఆర్‌ఎస్ మంత్రులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ములుగు ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో తన క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా సీతక్క అడిగితేనే మెడికల్ కళాశాల ఇస్తున్నామని మంత్రి హరీశ్‌రావు చెప్పారని, బుధవారం పర్యటనలో మరో మంత్రి కేటీఆర్ ప్రతిపక్ష ఎమ్మెల్యే కోరకపోయిన మెడికల్ కళాశాల ఇచ్చామని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లేనిపోని ఆరోపణలు చేసిన కేటీఆర్ ఈ ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవ చేస్తున్నానన్నారు. కానీ బీఆర్‌ఎస్ మంత్రులు తనను టార్గెట్ చేసి రాజకీయం చేస్తున్నారన్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో ములుగు నియోజకవర్గంలో గెలిచేది కాంగ్రెస్ పార్టే అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, జాడి వెంకటేశ్వర్లు, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఆకుతోట చంద్రమౌళి, బండి శ్రీనివాస్, నల్లెల్ల భరత్‌కుమార్, గండి కుమార్, భిక్షపతి, రేవంత్‌యాదవ్, వంశీకృష్ణ తిరుపతి, వంగ రవియాదవ్ పాల్గొన్నారు.

సాగునీటితో గ్రామాలు సస్యశ్యామలం



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల: ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన తెలంగాణలో స్వరాష్ట్రం సిద్ధించాక సీఎం కేసీఆర్ కృషితో భూగర్భ జలాల పెరిగి గ్రామాలు సస్యశ్యామలం అయ్యాయని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం రంగాపురంలో సర్పంచ్ సైదులు ఆధ్వర్యంలో నిర్వహించిన ‘చెరువుల పండుగ’ కార్యక్రమంలో పాల్గొని కట్ట మైసమ్మకు పూజలు చేసిన అనంతరం బతుకమ్మలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు గ్రామాల బాట పడుతున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఆరు నెలల్లో రంగాపురం చెరువును కాళేశ్వరం,దేవాదుల నీటితో నింపేందుకు రెండు కాల్వలు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. ఏడాదిలో ఇల్లు లేని నిరుపేదలకు సొంత స్థలంలో ఇల్లు మంజూరు చేయిస్తానని మంత్రి తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీపీఓ రంగాచారి, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామోజీ, కోఆప్షన్ నసీర్, ఎంఎంసీ, దేవస్థాన డైరెక్టర్లు అమరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి..అనంత లోకాలకు..



కనకయ్య (ఫైల్)

బచ్చన్నపేట: బైక్ అదుపు తప్పి మండలంలోని కొడవటూర్‌కు చెందిన ఆలయ ఉద్యోగి మిన్నాలపురం కనకయ్య (45) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం కనకయ్య సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి దేవస్థానంలో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం రాత్రి బసిరెడ్డిపల్లిలో ఓ విందుకు హాజరయ్యాడు. అక్కడ తన సెల్ ఫోన్ మరిచిపోయాడు. గురువారం ఉదయం ఆ ఫోన్‌ను తీసుకొని విధులకు బయలుదేరాడు. మార్గమధ్యంలో గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు కిందకు పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. కాగా, ఆలయ ఈవో బాలాజీ, శాసనమండలి మాజీ చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు.. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో

- ఒకరి మృతి
- మరొకరి తీవ్రగాయాలు



సంతోష్ (ఫైల్)

జనగామ రూరల్: చెట్లకు నీరు పోస్తున్న ట్రాక్టర్‌ను ఆటో ఢీకొనగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై కల్లెం బ్రిడ్జి సమీపంలో జరిగింది. జనగామ సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం జనగామ మండలంలోని ఓబుల్ కేశావాపూర్‌కు చెందిన మ్యాక నర్సయ్య రెండో కుమారుడు సంతోష్ (30) ఆటో డ్రైవర్. బుధవారం సాయంత్రం సిద్దెంకి గ్రామానికి చెందిన ముస్త్యాల సురేశ్‌కు చెందిన మామిడి కాయలను ఆటోలో వరంగల్ మార్కెట్‌కు తరలించారు. విక్రయించిన అనంతరం గురువారం గ్రామానికి వస్తుండగా కల్లెం బ్రిడ్జి వద్ద చెట్లకునీరు పోస్తున్న ఎల్అండ్‌టీ కంపెనీకి చెందిన ట్రాక్టర్‌ను ఆటో వెనక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ సంతోష్ అక్కడిక్కడే మృతి చెందగా పక్కన కూర్చున్న సురేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే సురేశ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కాగా, ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలిపి ఉంచడంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు.

టిప్పర్, బైక్ ఢీ

- రైతు మృతి

హసన్‌పర్తి : టిప్పర్.. బైక్‌ను ఢీకొనడంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం మునిపల్లిలో జరిగింది. మునిపల్లికి చెందిన ఉచిత సమ్మయ్య(63) గురువారం ఉదయం బైక్‌పై వ్యవసాయ బావివద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో టిప్పర్..బైక్‌ను ఢీకొంది. ఈఘటనలో సమ్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

ఆలస్యంగా పలు రైళ్లు..

- ఇబ్బందుల్లో ప్రయాణికులు



కాశిబుగ్గ : కాజీపేట– విజయవాడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న మూడో రైల్వే లైన్ పనుల కారణంగా వరంగల్ మీదుగా వెళ్లే పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానాపూర్ నుంచి బెంగుళూరు వెళ్లే 06510 కేఎస్ఆర్ బెంగళూరు క్లోన్ ప్రత్యేక రైలు 4. 10 గంటలు, గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే 12705 ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ 3.15 గంటలు, తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్లే 17405 కృష్ణా ఎక్స్‌ప్రెస్ 4.20 గంటలు, కోర్బా నుంచి కొచువేలి వెళ్లే 22647 కొచువేలి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 6 గంటలు, సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే 20834 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 1.30 గంటలు, సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే 17202 గోల్కొండ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు, సిర్‌పూర్ టౌన్ నుంచి భద్రాచలం వెళ్లే 17034 సింగరేణి మెము ఎక్స్‌ప్రెస్ 4 గంటలు, చెన్నై సెంట్రల్ నుంచి శ్రీమాత వైష్ణోదేవి కాత్రా వెళ్లే 16031 అండమాన్ ఎక్స్‌ప్రెస్ 1.55 గంటలు, శ్రీమాతా వైష్ణోదేవి కాత్రా నుంచి చెన్నై వెళ్లే 16032 అండమాన్ ఎక్స్‌ప్రెస్ 3.13 గంటలు, నర్సపూర్ నుంచి నాగర్‌సోల్ వెళ్లే 12787 నాగర్‌సోల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 2.39 గంటలు, అలాగే నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్లే 12788 నాగర్‌సోల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 2.40 గంటలు, బెంగళూరు నుంచి దానాపూర్ వెళ్లే 12295 సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 3.10 గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

ఏసీబీ వలలో.. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్



ఏసీబీకి పట్టుపడిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుమతి

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పోలం సుమతి గురువారం రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కింది. ఏసీబీ డీఎస్పీ కె.సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగూడూరు మండలం బావోజీ తండాకు చెందిన దరంసోతు వెంకన్న కుమారుడు నరేశ్ 2022 ఫిబ్రవరి 2వ తేదీన ఆన్‌లైన్‌లో లేబర్ ఇన్సూరెన్స్ దరఖాస్తు చేసుకున్నాడు. డిసెంబర్ 22న నరేష్ చనిపోయాడు. కుమారుడి ఇన్సూరెన్స్ క్లైమ్ కోసం తండ్రి వెంకన్న తొర్రూరు లేబర్ కార్యాలయ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సుమతిని ఆశ్రయించాడు. నాలుగు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. చివరికి ఆమె రూ.30 వేలు లంచం డిమాండ్ చేయగా రూ.20 వేలు ఇస్తానని అంగీకరించాడు. ఈ నేపథ్యంలో వెంకన్న.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి పథకం ప్రకారం గురువారం వెంకన్ననుంచి సుమతి రూ.20వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమెను ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ వెల్లడించారు.

బయ్యారంలో మంత్రి సత్యవతిరాథోడ్ పర్యటన



బతుకమ్మ ఆడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్



మంత్రిని అడ్డుకుంటున్న అఖిలపక్ష నాయకులు

బయ్యారం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఊరూరా చెరువు పండగను పురస్కరించుకుని గురువారం బయ్యారం పెద్ద చెరువు వద్దకు రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్ ట్రాక్టర్ మీద ర్యాలీగా వచ్చారు. ప్రజలు బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపుగా చెరువు వద్దకు చేరుకున్నారు. అనంతరం కట్ట మైసమ్మ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి సత్యవతిరాథోడ్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పాడి ఉత్సాహపరిచారు. అనంతరం ఆమె మాట్లాడారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, ఎమ్మెల్యే హరిప్రియ, కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎంపీపీ మౌనిక, వైస్ఎంపీపీ గణేష్, సొసైటీ చైర్మన్ మధూకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

మంత్రికి నిరసన సెగ..

బయ్యారం పెద్ద చెరువు వద్దకు వచ్చిన మంత్రి సత్యవతిరాథోడ్‌కు అఖిలపక్ష నాయకుల నుంచి నిరసన సెగ తగిలింది. కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం పెద్ద చెరువు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉత్సవాలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నిస్తూ పలు పార్టీల నాయకులు చెరువు వద్దకు చేరుకున్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని.. మంత్రి వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. నాయకులు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ, కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.